సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 16 । డిసెంబర్ । 2023



కైకరం షష్ఠికి ఏర్పాట్లు

కైకరంలో సుబ్రహ్మణ్య షష్ఠికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 18 నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

8లో ▸



ఆక్వాసాగుపై ప్రత్యేక శిక్షణ

సమీకృత వ్యవసాయ విధానంలో చేపల పెంపకంపై వెంకట్రామన్నగూడెం ఉద్యాన వర్సిటీలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

8లో ▸



సత్తాచాటిన అథ్లెట్లు

ఏలూరులోని స్టేట్ లెవెల్ ఖేలో ఇండియా సెంటర్ అథ్లెట్లు సత్తాచాటారు. పలు విభాగాల్లో పతకాలు సాధించారు.

8లో ▸

న్యూస్‌రీల్

ప్రతి రైతుకూ మేలు



పంట నష్టం వివరాలు తెలుసుకుంటున్న జేసీ

పెనుగొండ: మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతుకూ మేలుచేసేలా ప్రభుత్వం కృషి చేస్తుందని, జిల్లా పంట నష్ట నమోదు పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని పెనుమంట్ర, ఆచంట మండలాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని, నేలనంటిన వరిచేలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రంగు మారిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు ఉన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్



అర్జీలు స్వీకరిస్తున్న అధికారి అప్పారావు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించుకుని, విధుల్లో మంచి సేవలు అందించాలని జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు అన్నారు. కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన అర్జీలు స్వీకరించారు. సర్వీసు మేటర్స్, పెన్షన్ సమస్యలు, ఆర్థికపరమైన అంశాలు, క్రమశిక్షణ కేసులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యపై ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో అర్జీలు అందజేసి పరిష్కరించుకోవచ్చన్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మూడు దరఖాస్తులు అందాయన్నారు. కలెక్టరేట్ ఏఓ వైకేపీ అప్పారావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై అసత్య ప్రచారం తగదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు, టీచర్లు ఆయాలు సచివాలయ ఉద్యోగులపై అసత్య ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై ప్రజలకు ఆగ్రహాన్ని కలిగించేలా చేయడాన్ని రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్ జీవీఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ నీతి, నిజాయితీతో పారదర్శకంగా సేవలందిస్తున్న వ్యవస్థపై కుటిల నీతితో అక్కసు వెళ్లగక్కడాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. సచివాలయ ఉద్యోగులపై కొందరు అంగన్‌వాడీ నిర్వాహకుల ముసుగులో చేస్తున్న వ్యాఖ్యలను సహించమని, కొన్ని రాజకీయ శక్తులు వీరిని వెనుకుండి నడిపిస్తున్నామని ఆరోపించారు. సచివాలయ ఉద్యోగులను తూలనాడడానికి వీరికి ఉన్న అర్హతేంటి అని ప్రశ్నించారు. పిల్లలు, గర్భిణులకు ఇబ్బంది లేకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత కాదా అన్నారు. పిల్లలని పస్తులు ఉండేలా చేయమని చెప్పే హక్కు, నైతికత వీరికి ఎక్కడిదని మండిపడ్డారు. తమ పరిధిలోని ప్రతి కుటుంబానికి సేవ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తమపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలవరం డీఎస్పీగా రత్నరాజు

పోలవరం రూరల్: పోలవరం డీఎస్పీగా జి.రత్నరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈయన కృష్ణా జిల్లాలో సీఐగా పనిచేస్తూ పదోన్నతిపై పోలవరం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. పోలవరం సీఐ కె.విజయబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో శాంతి భద్రతలను కాపాడానికి పటిష్ట చర్యలు తీసుకుంటామని, ఇక్కడున్న పరిస్థితులను త్వరగా అవగాహన చేసుకుని, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకానికి దరఖాస్తులు

ఏలూరు(మెట్రో): రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బడుగు బలహీన, వెనుకబడిన వర్గాల అభ్యర్థుల కోసం ప్రభుత్వం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ మేరకు యూపీఎస్సీ సివిల్స్ పరీక్షల్లో ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తే రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధిస్తే రూ.50 వేలు అందిస్తారని, ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు jnanabhumi.ap.gov.in పోర్టల్‌లో వెబ్ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మురిపించెన్

పింఛన్ రూ.3 వేలు

- రాష్ట్ర కేబినెట్ నిర్ణయం
- జనవరి నుంచి పెరిగిన సాయం
- 'పశ్చిమ'లో 2.24లక్షల మంది లబ్ధిదారులు
- రూ.65.94 కోట్ల అందజేత
- రూ.4.67 కోట్ల మేర అదనపు లబ్ధి

వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు

పింఛన్ రకం	సంఖ్య
వృద్ధాప్య	1,22,781
వితంతు	46,951
దివ్యాంగ	26,560
ఒంటరి మహిళ	6,684
చేనేత	2,691
గీత కార్మిక	2,895
అభయహస్తం	8,356
ఇతరులు	7,226
మొత్తం	2,24,144

సాక్షి, భీమవరం: సామాజిక పింఛన్ల పంపిణీలో మరో చారిత్రాక ఘట్టానికి త్వరలో తెరలేవనుంది. ప్రస్తుతం నెలకు అందిస్తున్న రూ.2,750 సాయాన్ని రూ.3,000 పెంచుతూ శుక్రవారం రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జనవరి నుంచి పెంచిన సాయం లబ్ధిదారులకు అందనుంది. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళలు తదితర వర్గాల వారికి ఆసరాగా ప్రతినెలా ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుక పేరిట సామాజిక పింఛన్లు అందిస్తోంది. ఠంచన్‌గా ఒకటో తారీఖు వేకువజాము నుంచి రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ పండుగలా సాగుతోంది. వలంటీర్, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ పింఛన్ డబ్బులు అందిస్తున్నారు.

మాట ఇచ్చినట్టుగానే..

ఎన్నికలకు ముందు రూ.2 వేలుగా ఉన్న పింఛన్ సాయాన్ని దశల వారీగా రూ.3 వేలకు పెంచుతానని విపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే రూ.2,250లకు పెంచారు. అలాగే లబ్ధిదారుల ఎదురుచూపులకు చరమగీతం పాడారు. పొద్దుపొడవక ముందే వలంటీర్లతో ఇంటి వద్దే పింఛన్ సొమ్ములు అందిస్తున్నారు. అనారోగ్యంతో లబ్ధిదారులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుంటే మానవతా దృక్పథంతో వలంటీర్లు వారి చెంతకు వెళ్లి మరీ పింఛన్ సాయం అందిస్తున్నారు.



హైదరాబాద్ వెళ్లి వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న రాయకుదురుకు చెందిన వలంటీర్ వెలిదిండి మణికంఠ (ఫైల్)

అర్హతే ప్రామాణికంగా..

అర్హతే ప్రామాణికంగా అవినీతికి తావులేకుండా పింఛన్ లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు ఎక్కడికి తిరగాల్సిన పనిలేకుండా వివరాలను వలంటీర్‌కు తెలియజేస్తే చాలు వారే సచివాలయాల్లో పేర్లు నమోదు చేయించి పింఛన్లు మంజూరు చేయించేలా వ్యవస్థలో మార్పులు తెచ్చారు. 2022 జనవరి నుంచి రూ.2,500లకు, 2023 జనవరి నుంచి రూ.2,750లకు పింఛన్ మొత్తాన్ని పెంచుకుంటూ వచ్చారు. తాజాగా రానున్న జనవరి నుంచి రూ.3 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

గతంలో ప్రహసనంలా.. గత తెలుగుదేశం పార్టీ హయాంలో లబ్ధిదారుల ఎంపిక నుంచి నగదు పంపిణీ వరకు ప్రహసనంగా సాగేది. కొత్తగా పింఛన్ దరఖాస్తు చేసుకునే వారు జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. నగదు కోసం 1వ తేదీ నుంచి కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు పడిగాపులు పడేవారు. ఒక్కోసారి వారం రోజులు వరకు కూడా సొమ్ములు అందక ఇబ్బందులు పడాల్సి వచ్చేది.

ఇప్పటివరకు రూ.61.27 కోట్లు

ప్రస్తుతం జిల్లాలో సామాజిక పింఛన్ లబ్ధిదారులు 2,24,144 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం ప్రతినెలా రూ.61.27 కోట్ల మొత్తాన్ని పింఛన్ సాయంగా అందిస్తోంది. తాజా నిర్ణయంతో లబ్ధిదారునికి అదనంగా రూ.250 కలిపి రూ.3 వేల సాయం అందనుంది. ఈ మేరకు ప్రభుత్వంపై నెలకు రూ.4.67 కోట్లు అదనపు భారం పడుతుంది. పింఛన్ సాయాన్ని పెంచడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేందుకు ఈ పెంపు దోహదపడుతుందని అంటున్నారు.

ఏలూరు జిల్లాలో 2.78 లక్షల మంది..

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో సామాజిక పింఛన్ లబ్ధిదారులు 2,78,519 మంది ఉన్నారు. వీరికి ప్రస్తుతం రూ.77.31 కోట్లను పింఛన్ల కింద ప్రభుత్వం అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా వృద్ధులు 1,42,068 మంది, మత్స్యకారులు 6,523 మంది, ఒంటరి మహిళలు 8,659 మంది, కల్లుగీత కార్మికులు 4,736 మంది, చర్మకారులు 1,739 మంది, చేనేత కార్మికులు 1,214 మంది, వితంతువులు 68,884 మందికి రూ.250 చొప్పున పెంచి ఇకపై నెలకు రూ.3 వేలు పింఛన్ అందించనున్నారు. ఇదిలా ఉండగా 2022 జనవరిలో 11,470, 2022 జూలైలో 13,748, 2023 జనవరిలో 8,902, 2023 ఆగస్టులో 16,198 మందికి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసింది. అలాగే వీరితో పాటు కిడ్నీ బాధితులు, డప్పు కళాకారులు, దివ్యాంగులకు, ట్రాన్స్‌జెండర్స్‌కూ ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది.

చర్యలు తీసుకుంటున్నాం



ప్రస్తుతం ఇస్తున్న రూ.2,750లు పింఛన్ సాయాన్ని ప్రభుత్వం రూ.3 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జనవరి 1 నుంచి లబ్ధిదారులకు పెంచిన సాయాన్ని అందిస్తాం. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్‌వీ శివప్రసాద్‌యాదవ్, డీఆర్‌డీఏ పీడీ

మాట ఇచ్చినట్టే..



నా భర్త చనిపోయి 15 ఏళ్లవుతుంది. పిల్లలకు పెళ్లిళ్లు అయిపోయాయి. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బులు ఆసరాగా ఉంటున్నాయి. చెప్పినట్టుగానే జగన్ సారు పింఛన్ సొమ్ములను రూ.3 వేలకు పెంచుకుంటూ వచ్చారు. చాలా ఆనందంగా ఉంది.

– పెచ్చేటి గంగాలక్ష్మి, తూర్పుపాలెం, పోడూరు మండలం

మాలాంటోళ్లకు మేలు



పింఛన్ డబ్బులే నాకు జీవనాధారం. గతంలో నా భర్త చనిపోగా, ఇటీవల కుమారుడు మృతిచెందడంతో జీవనం చాలా కష్టంగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన నాలాంటి ఎంతో మంది పేదలకు కొండంత అండగా ఉంటోంది.

– ఉన్నమట్ల రత్నమాణిక్యం, మేడపాడు, యలమంచిలి మండలం

అమరజీవికి ఘన నివాళి



తణుకులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయులు అమరజీవి పొట్టి శ్రీరాములు అని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం తణుకు రాష్ట్రపతి రోడ్డులోని అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒక ఆశయాన్ని తలపెట్టి దానిని ఎలా సాధించాలనే పోరాటయోధుడిగా పొట్టి శ్రీరాములు చూపించిన తెగువ ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, అత్తిలి మండల అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, జల్లూరి జగదీష్ పాల్గొన్నారు.

భీమవరం కలెక్టరేట్‌లో..

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ పి.ప్రశాంతి అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములును ప్రతిఒక్కరూ స్మరించుకోవాలన్నారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని దేశ సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు, జిల్లా, మండల సచివాలయాలు అధికారి కేసీహెచ్ అప్పారావు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన విద్యను దూరం చేసే కుట్రలు

- అక్కసుతోనే ఎల్లోమీడియా విషపు రాతలు
- ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు ధ్వజం



భీమడోలు(గణపవరం): రాష్ట్రంలో పేద పిల్లలకు నాణ్యమైన విద్యకు దూరం చేయాలన్న ఉద్దేశంతోనే ఎల్లోమీడియా సంస్థలు తప్పుడు రాతలు రాస్తున్నాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మండిపడ్డారు. బైజూస్ కంటెంట్, ట్యాబ్‌లపై ఈనాడు పత్రికలో రాసిన కథనాన్ని తీవ్రంగా ఖండించారు. గణపవరం మండలం బువ్వనపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వర్గాలకు చెందిన పిల్లలు విద్యలో రాణించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో సీఎం జగన్ బైజూస్ కంటెంట్, ట్యాబ్‌లను అందిస్తుంటే.. పిల్లల భవిష్యత్తును దెబ్బతీసేలా ఎల్లోమీడియా రాతలను సహించబోమన్నారు. సర్కారీ బడుల్లోని విద్యార్థులు ప్రపంచ స్థాయి వేదికలపై సత్తాచాటుతుంటే ఎల్లోమీడియా ఓర్వలేకపోతుందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఇస్తున్న ట్యాబ్‌లను తమ పిల్లలు చక్కగా వినియోగించుకుంటున్నారని, చదువుల్లో రాణిస్తున్నారని తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన తరుణంలో, టోఫెల్ అమలు చేసినప్పుడు ఇదే పత్రిక వ్యతిరేక కథనాలు రాసిందన్నారు. సీఎం జగన్ విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నారని, నిర్దేశిత పాఠ్యాంశాలు తప్ప విద్యేతర అంశాలకు ట్యాబ్‌లను వినియోగించకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుందన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని, అలాంటి వ్యవస్థకు జీవం పోసిన యోధుడు సీఎం జగన్ అన్నారు. రాష్ట్రంలో 5.50 లక్షల మంది విద్యార్థులకు సీఎం జగన్ ట్యాబ్‌లు అందజేశారన్నారు. ఏ విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనకు కాకుండా వేరే వాటికి ట్యాబ్‌లను వాడుతున్నదీ చెప్పాలని ఆ పత్రిక యాజమాన్యాన్ని ఆయన డిమాండ్ చేశారు. జగనన్న ప్రభుత్వంపై విష ప్రచారం చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి వార్తలు రాస్తున్నారని ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు.

రాష్ట్రంలో మహిళలకు అధిక ప్రాధాన్యం



ఏలూరు సెయింట్ థెరిస్సా కళాశాల విద్యార్థినులతో హోం మంత్రి తానేటి వనిత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నిరంగాల్లో మహిళలకు ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ థెరిస్సా స్వయంప్రతిపత్తి మహిళా కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోం మంత్రిని కావాలని తాను ఎప్పుడూ అనుకోలేదని, దేవుడు, సీఎం జగన్ ఈ అవకాశం కల్పించారన్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న ఏకైక మహిళా హోం మంత్రిని తానే కావడం గర్వకారణంగా ఉందన్నారు. తాను సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివానని గుర్తు చేసుకుని ఆనాటి మధురానుభూతులను విద్యార్థినులతో పంచుకున్నారు. తొలుత డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలీ, తహసీల్దార్ బి.సోమశేఖర్, కళాశాల యాజమాన్య ప్రతినిధులు సిస్టర్ ఎర్నెస్టిన్ ఫెర్నాండెజ్, సిస్టర్ మెర్సీ, విద్యార్థినులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

పదోన్నతులకు వినతి

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వీఆర్‌ఏల నుంచి వీఆర్వో గ్రేడ్–2 ప్రమోషన్ నిమిత్తం కౌన్సెలింగ్ పూర్తయిన వారికి పదోన్నతి ఉత్తర్వులు జారీ చేయాలని, వీఆర్వో గ్రేడ్–2కు అన్ని అర్హతలు ఉన్న తమకు ప్రమోషన్ ఇప్పించాలని పలువురు ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన ఉద్యోగుల గ్రీవెన్స్‌లో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లును కోరారు. అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమంలో చెరగని ముద్ర

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సాబ్జీకి ఘన నివాళి



ఎమ్మెల్సీ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, (ఇన్‌సెట్‌లో) సాబ్జీ (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట)/భీమవరం (ప్రకాశంచౌక్)/ఉండి: ఉండి మండలం చెరుకువాడ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ (60) అక్కడికక్కడే మృతిచెందారు. భీమవరం ప్రభుత్వాస్పత్రిలో ఆయన భౌతికకాయానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. భీమవరం ప్రభుత్వాస్పత్రి వద్ద సాబ్జీ పార్థీవదేహానికి శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, భీమవరం ఆర్డీఓ శ్రీనివాసులరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఆయనకు భార్య సుభానీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దేవరపల్లి మండలం ధుమంతునిగూడెంలో షేక్ కబీర్, సైదాబీబీ దంపతులకు మూడో సంతానంగా 1966 జనవరి 5న ఆయన జన్మించారు. 1989లో స్పెషల్ టీచర్‌గా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లో పనిచేశారు. మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఉత్తమ బోధన, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేశారు.

యూటీఎఫ్ ద్వారా ఉద్యమ పథంలోకి..

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్)లో జిల్లా కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన వ్యవహరించారు. 2021లో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలుపొంది శాసనమండలిలో అడుగుపెట్టారు. 1990 నుంచి ఉపాధ్యాయ సమస్యలపై ఆయన పలు పోరాటాలు చేశారు. 2008లో 13 రోజుల సమ్మెకు జిల్లాలో నాయకత్వం వహించారు. 30 గంటల నిరవధిక నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం కొట్టు సంతాపం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎమ్మెల్సీ సాబ్జీ ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించారని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. ఉపాధ్యాయ ఉద్యమంలో చెరగని ముద్రవేశారని, టీచర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. సాబ్జీ మరణం ఉపాధ్యాయ లోకానికి తీరనిలోటన్నారు.

సమస్యలపై పోరాడే వ్యక్తి

ఏలూరు(మెట్రో): ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా నిరంతరం సమస్యలపై పోరాడే వ్యక్తి షేక్ సాబ్జీ అని, ఆయన మృతి తీరని లోటని ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఢిల్లీలో ఉన్న ఆయన సాబ్జీ మృతి విషయం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సాబ్జీ మృతికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు వెంకట రామారావు, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, ఉపాధ్యాయ సంఘాల నేతలు సంతాపం తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఉండి: ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి కారకులైన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆకివీడు మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ బోణం స్వామిదినేష్ అనే యువకుడు అతి వేగంగా, నిర్లక్ష్యంగా కారు నడిపి ప్రమాదానికి కారకుడయ్యాడని గుర్తించారు. అలాగే కారు యజమాని దుంపగడపకి చెందిన జోకుబత్తి రమేష్‌పైనా కేసు నమోదు చేశారు. మైనర్‌కు వాహనాన్ని ఇచ్చి వ్యక్తి మృతికి కారకుడైన కారు యజమాని రమేష్, యువకుడు స్వామిదినేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ చెప్పారు.

టెన్త్ విద్యార్థుల వివరాలు సరిచూసుకోండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే మార్చి 18 నుంచి జరిగే ఎస్ఎస్‌సీ, ఓఎస్ఎస్‌సీ, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయని, వాటిని సరిచూసుకోవాలని ఏలూరు డీఈఓ పి.శ్యామ్‌సుందర్ ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు నమోదు చేసిన వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సవరించుకోవడానికి ఈనెల 16 నుంచి 20 వరకు అవకాశం కల్పించారన్నారు. ఈ మేరకు స్కూల్ లాగిన్‌లో విద్యార్థుల వివరాలు సవరించుకోవచ్చన్నారు. విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, ప్రథమ భాష, ద్వితీయ భాష, పరీక్షా మాధ్యమం, వైకల్యం, ఓఎస్ఎస్‌సీ సబ్జెక్టు, కోడ్, ఒకేషనల్ ఎస్ఎస్‌సీ సబ్జెక్టు, కోడ్, గుర్తింపు చిహ్నాలు, విద్యార్థుల ఫొటోలు, సంతకాలు మాత్రమే సవరించుకునే వీలుందన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

అధికారిక కార్యక్రమం అభినందనీయం



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో అమరజీవికి నిజమైన నివాళులు లభిస్తున్నాయని ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చెక్క రాజా అన్నారు. ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వసంతమహల్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆర్యవైశ్య విభాగం నాయకుడు మోటమర్రి సదానందకుమార్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా తెలుగు మాట్లాడేవారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తూ రాష్ట్రాన్ని విభజించడం దురదృష్టకరమన్నారు. సంఘ కోశాధికారి మద్దుల సత్యకుమార్, బొలిశెట్టి సురేష్ కుమార్, మద్దుల పవన్, నంగులూరి సత్యనారాయణ, చలువాది బ్రహ్మయ్య, రేవూరి జగదీష్, ఆర్యవైశ్య ప్రముఖులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్లుప్తంగా

చేనేత విభాగం జనరల్ సెక్రటరీగా పరమేశ్వరరావు



పాలకోడేరు: రాష్ట్ర చేనేత విభాగం జనరల్ సెక్రటరీగా పాలకోడేరు మండలం గొరగనమూడి గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు బళ్ళ పరమేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు క్రాస్ కంట్రీ జట్ల ఎంపికలు

తణుకు అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా క్రాస్ కంట్రీ జిల్లా జట్ల ఎంపికలు ఈనెల 17న శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. ఎంపికైన జట్లు సామర్లకోటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని వివరించారు. అండర్ 16 బాలురు, బాలికలకు 2కె, అండర్ 18 బాలురకు 6కె, బాలికలకు 4కె, అండర్ 20 బాలురకు 8కె, బాలికలకు 6కె, పురుషులకు 10కె, స్త్రీలకు 10కె కేటగిరీల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెలక్షన్స్‌కు వచ్చే క్రీడాకారులు పంచాయతీ/మునిసిపాలిటీ జారీచేసిన పుట్టిన తేదీ ధ్రువపత్రం, రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజుతో 17వ తేదీ ఉదయం 6 గంటలకు ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.బాబూరావు 82472 60545 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఎస్ఈబీ అధికారుల దాడులు

చింతలపూడి: చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ పరిధిలోని చింతలపూడి, కామవరపుకోట మండలంలో శుక్రవారం ఏలూరు డీటీఎఫ్ సిబ్బంది, స్థానిక ఎస్ఈబీ సిబ్బంది దాడులు నిర్వహించారు. దాడుల్లో కామవరపుకోట గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు, మిడతా నాగేశ్వరరావు, శిరిగి బత్తుల సుబ్బారావును అరెస్ట్ చేసి వారి నుంచి 12 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. చింతలపూడి మండలం, రేచర్ల గ్రామానికి చెందిన దొంతా నారాయణమ్మను అరెస్ట్ చేసి ఆమె నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

ఆక్వా సాగుపై ప్రత్యేక శిక్షణ

- ఛత్తీస్‌గఢ్ విద్యార్థులకు ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో అవగాహన
- చేపల రకాలు, సీడ్, వ్యాధులపై తరగతులు
- ఉద్యాన వర్సిటీ పరిధిలో క్షేత్రస్థాయి సందర్శనలు



శిక్షణలో ఉన్న విద్యార్థులతో వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: సమీకృత వ్యవసాయ విధానంలో చేపల పెంపకంపై ఛత్తీస్‌గఢ్ విద్యార్థులకు ఉద్యాన వర్సిటీలో ప్రత్యేక శిక్షణనిచ్చారు. మంచినీటి చెరువుల్లో చేపల సాగుపై 83 మంది విద్యార్థులు వర్సిటీలో ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే ఆక్వా రంగం ఊపిరి పోసుకుంటోంది. ఈ నేపథ్యంలో చంద్రశేఖర్ కామధేను విశ్వవిద్యాలయం విద్యార్థులను ఇక్కడికి పంపింది. రెండు బ్యాచ్‌లుగా 83 విద్యార్థులు వెంకట్రామన్నగూడెం వచ్చారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞానకేంద్రంలో ఒక్కొక్క బ్యాచ్ 15 రోజుల వంతున శిక్షణ పూర్తి చేసుకుంది. చేప పుట్టిన దగ్గర నుంచి దశలు ఎలా ఉంటాయనే విషయాలపై అవగాహన కల్పించారు. పిల్లల ఉత్పత్తి, మంచినీటి చెరువుల్లో చేపల పెంపకం గురించి బాదంపూడి మత్స్య పరిశోధనాకేంద్రంలో శిక్షణ ఇచ్చారు. రొయ్యల హేచరీలో పిల్ల తయారీ గురించి విశదీకరించారు. చేపల కొచ్చే రోగాలు, వాటి నివారణ గురించి క్షేత్రస్థాయి పర్యటనలో ఉండి మత్స్యపరిశోధనా కేంద్రంలో అవగాహన కల్పించారు. వాటర్ టెస్టింగ్ ల్యాబ్ పనితీరు గురించి భీమవరంలోని జెనిసిస్‌లో ల్యాబ్‌లో వివరించారు. సమగ్ర సైద్ధాంతిక పరిజ్ఞానం, ఆచరణాత్మకమైన అనుభవాన్ని నేర్పించారు. వర్సిటీ పరిధిలోని పునారామ్ నిషాద్ మత్స్య కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఈ శిక్షణకు పంపించారు. చేపల పెంపకంతో పాటు హేచరీ నిర్వహణ, నర్సరీ పెంపకం, గ్రో అవుట్ చెరువు పెంపకం, బయో సెక్యూరిటీ ప్రొటోకాల్స్, ఆల్టే పెంపకం పద్ధతులు తదితరాలపై శిక్షణ అందించారు.



సమీకృత వ్యవసాయంలో విద్యార్థులు



చేపల పెంపకంపై శిక్షణ

శిక్షణ బాగుంది



చేపల పెంపకంపై ఇచ్చిన శిక్షణ చాలా బాగుంది. ఇంత మంచి అవకాశం వస్తుందని ఊహించలేదు. ఆక్వా కల్చర్‌కు సంబంధించి ఇలాంటి శిక్షణలు మరిన్ని ఉంటే బాగుంటుంది.

– అదితి బనాచోర్, ఛత్తీస్‌గఢ్

అధ్యాపకుల కృషి అభినందనీయం



శిక్షణ అద్భుతంగా ఉంది. మా చదువుకు ఉపయుక్తంగా ఉండేలా శిక్షణ సాగింది. అంకితభావంతో అన్ని విషయాలు బోధించిన అధ్యాపకులు నిర్వాహకుల కృషి అభినందనీయం.

– హితాక్షి సాహు, ఎల్ఎస్‌పీఎన్ కాలేజ్ ఆఫ్ ఫిషరీస్, ఛత్తీస్‌గఢ్

కొత్త విషయాలు నేర్చుకున్నా



కొత్త విషయాలు నేర్చుకున్నా. చేపల పెంపకం, హేచరీల నిర్వహణ, మేత నిర్వహణ వంటి విషయాలు తెలిశాయి. కేవీకే ద్వారా మంచినీటి చెరువుల్లో చేపల పెంపకం గురించి తెలుసుకున్నా.

–మయాంక్ ఠాగూర్, ఛత్తీస్‌గఢ్

మంచి అనుభవం



ఆక్వా శిక్షణ మంచి అనుభవం. క్షేత్ర స్థాయి పర్యటనలతో విషయ జ్ఞానం పెరిగింది. అనుభవజ్ఞుల పరిచయం అక్కరకు వచ్చింది. చాలా విషయాలు నేర్పారు.

– దీపాళి భండారీ, ఛత్తీస్‌గఢ్

మరువలేని జ్ఞాపకం



ఛత్తీస్‌గఢ్ నుంచి ఇక్కడకు శిక్షణకు రావడం మరువలేని జ్ఞాపకం. క్షేత్రస్థాయిలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాం. దీనిని సద్వినియోగం చేసుకుంటాం. పంపించిన కళాశాలలకు, శిక్షణ నిచ్చిన ఉద్యానవర్సిటీలను గుర్తుంచుకుంటాం.

– ఆదిత్య చంద్రవంశీ, ఛత్తీస్‌గఢ్

దేశం మెచ్చిన బాపు బొమ్మ

శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



బాపు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

పాలకొల్లు అర్బన్: అక్షరం కంటే దృశ్య రూపంలో మనిషి భావాన్ని చూపిన గొప్ప వ్యక్తి బాపు అన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్‌రాజు అన్నారు. పాలకొల్లులో ది ఆర్టిస్ట్స్ అండ్ పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాపు జయంతి సందర్భంగా శుక్రవారం బాపు విగ్రహాన్ని మోషన్‌రాజు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా మోషేన్ రాజు మాట్లాడుతూ.. ఎవరైనా అందంగా ఉంటే బాపు బొమ్మతో పోలుస్తారని.. బాపు బొమ్మను దేశమంతా మెచ్చిందని, ఆంధ్రప్రదేశ్‌లో పాలకొల్లుకు కళారంగంలో ప్రత్యేక గుర్తింపు ఉందని మోషేన్‌రాజు స్పష్టం చేశారు. చేయి తిరిగిన చిత్రకారుడిగా ప్రపంచం కీర్తించిన బాపు మన ప్రాంతం వాడు కావడం విశేషమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. బాపు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్టిస్ట్స్ అండ్ పెయింటర్స్ సంఘ సభ్యులకు ఏ అవసరం ఉన్నా ఆదుకోవడానికి తాను ముందుంటానన్నారు. ఈ సందర్భంగా ఉదయ్ ఆర్ట్ గ్యాలరీ, వేణు ఆర్ట్స్, పాలకొల్లు బాలోత్సవం ఆధ్వర్యంలో పాలకొల్లులోని పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, జోగాడ ఉమామహేశ్వరరావు, ఆర్టిస్ట్స్ అండ్ పెయింటర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వల్లూరి రామబ్రహ్మం, అధ్యక్షుడు నీలం రవి, సంఘ నాయకులు సమతం శంకరరావు, బొప్పె సాంబమూర్తి, తాళం బాల సుబ్రహ్మణ్యం, నీల్ కమల్ ఆర్ట్స్ మూర్తి, కాసా కోటి వీరభద్రరావు, జీఎస్ఎన్ ఆర్ట్స్ సత్యనారాయణ, జీఎస్ఎన్ రవి తదితరులు పాల్గొన్నారు.

కైకరం షష్ఠికి ఏర్పాట్లు



కైకరంలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయం



కైకరంలో కొలువైన నాగమ్మ తల్లి

ఉంగుటూరు: ఏలూరు జిల్లాలో పేరొందిన కైకరం సుబ్రహ్మణ్య షష్ఠికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అత్తిలి తరువాత కైకరం షష్ఠి వైభవంగా నిర్వహిస్తారు. జిల్లా నలుమూలల నుంచి తీర్థం చూసేందుకు తరలివస్తారు. ఈ నేపథ్యంలో షష్ఠి కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఐదు రోజులు ఉత్సవాలు నిర్వహించేవారు. ఈ ఏడాది పండితుల సూచనల మేరకు ఏడు రోజులు నిర్వహిస్తున్నారు. ఏలూరు, కోదాడ, చిలుకలూరిపేట, విజయవాడ, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారు. సుమారు 2 లక్షల మంది ప్రజలు ఈ తిరునాళ్లలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. 18న షష్ఠి ప్రారంభం రోజున ఆలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో క్యూలైన్ల కోసం బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. షష్ఠి రోజున 10 వేల మందికి ఉచిత భోజనాల ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయ ప్రాంతంలో విద్యుత్ దీపాలతో కటౌట్లు ఏర్పాటు చేశారు. ఆలయం ముందు పందిర్లు నిర్మించారు. గణపవరం సీఐ సుభాష్ నేతృత్వంలో నలుగురు ఎస్సైలు, సుమారు 100 మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. షష్ఠి నేపథ్యంలో ఉంగుటూరు తహసీల్దారు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు.

సత్తా చాటిన అథ్లెట్లు



బెస్ట్ అథ్లెట్‌గా అవార్డు అందుకున్న బి.జాహ్నవి



నన్నయ్య యూనివర్సిటీ పోటీల్లో పతకాలు సాధించిన అథ్లెట్లు



ఏపీ ఎస్‌జీఎఫ్ పోటీల్లో పతకాలు సాధించిన ఖేలో ఇండియా సెంటర్ అథ్లెట్లు

ఏలూరు రూరల్: ఏలూరులోని స్టేట్ లెవెల్ ఖేలో ఇండియా సెంటర్ అథ్లెట్లు సత్తా చాటారు. వివిధ ప్రాంతాల్లో వేర్వేరుగా జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో సెంటర్ అథ్లెట్లు పాల్గొని పతకాల పంట పండించారని సెంటర్ ఇన్‌చార్జ్ డీఎస్‌వీ వినాయక్‌ప్రసాద్ వెల్లడించారు. ఈ నెల 12 నుంచి 14 వరకు పల్నాడు జిల్లా నర్సరావుపేటలో అండర్-17, 19 బాలబాలికల ఏపీ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్ 19 విభాగంలో వెంకటేష్ డిస్కస్‌త్రోలో గోల్డ్ మెడల్ సాధించారు. అండర్ 17 బాలుర విభాగంలో డి.ఉదయ్ జావెలిన్ త్రో గోల్డ్‌మెడల్ చేజిక్కించుకున్నాడు. ఇదే విభాగంలో బి.సుకుమార్ 100 మీటర్ల పరుగులో సిల్వర్‌మెడల్, 200 మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్ సాధించాడు. జి.వెంకటలోకేష్ 800, 1500 మీటర్ల పరుగులో సిల్వర్, బ్రాంజ్‌మెడల్ సొంతం చేసుకున్నాడు. కె.తిలక్‌పవన్ 400 మీటర్ల పరుగులో 4వ స్థానం, 200 మీటర్ల పరుగులో 8వ స్థానంలో నిలిచాడు. బాలికల అండర్ 17 విభాగంలో బి.జాహ్నవి 100, 200 మీటర్ల పరుగులో రెండు బంగారు పతకాలు సాధించి బెస్ట్ అథ్లెట్ అవార్డు అందుకుంది. షెలోని 400 మీటర్ల పరుగులో బంగారు పతకం, జావెలిన్ త్రో బ్రాంజ్ మెడల్ సాధించింది. టి.లక్ష్మీహర్ష 400, 800 మీటర్ల పరుగులో రెండు సిల్వర్ మెడల్స్ సొంతం చేసుకుంది, అండర్ 19 విభాగంలో ఎం.మానస షాట్‌పుట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది.

నన్నయ్య యూనివర్సిటీ పోటీల్లో పతకాలు

ఈ నెల 12న రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాల పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. వీరిలో బి.అర్చన 800, 1500 మీటర్ల పరుగులో రెండు గోల్డ్ మెడల్స్, జి.గణేష్ 100 మీటర్ల పరుగులో సిల్వర్, 200 మీటర్ల పరుగులో బ్రాంజ్, 4 ఇన్‌టూ 100 మీటర్ల పరుగులో సిల్వర్ సాధించాడు. టి.సామ్యూల్‌రాజ్ జావెలిన్‌త్రోలో బ్రాంజ్‌మెడల్, 4 ఇన్‌టూ 100 మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్ సాధించాడు. వి.రాజేష్ 4 ఇన్‌టూ 100 మీటర్ల పరుగులో గోల్డ్, 400 మీటర్ల పరుగులో సిల్వర్ చేజిక్కించుకున్నాడు.

స్టేట్ మీట్‌లో సాహిల్‌బాబుకు బంగారు పతకాలు



ఏలూరు రూరల్: ఏలూరుకు చెందిన సూపర్ అథ్లెట్ కెఎస్ఎస్ సాహిల్‌బాబు మరోమారు సత్తా చాటాడు. ఈ నెల 12 నుంచి 14 వరకు నరసరావుపేటలో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సొంతం చేసుకుని బెస్ట్ అథ్లెట్‌గా గుర్తింపు పొందాడు. అండర్-17 విభాగంలో పాల్గొన్న సాహిల్‌బాబు 100 మీటర్ల పరుగు పందెం 11.08 సెకన్లలో పూర్తి చేసి ఒక బంగారు పతకం, 100 మీటర్ల హర్డిల్స్ 13 సెకన్లలో పూర్తి చేసి మరో బంగారు పతకం సాధించాడు. గత నెల కోయంబత్తూర్‌లో జరిగిన నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ 16 విభాగంలో 80 మీటర్ల హర్డిల్స్ దూరాన్ని 10.55 సెకన్‌లో పూర్తి చేసి బంగారు పతకం చేజిక్కించుకున్న విషయం తెలిసిందే.

అదనపు జిల్లా జడ్జి కోర్టు మంజూరుపై హర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో అదనపు జిల్లా జడ్జి కోర్టు మంజూరుకు కేబినెట్ ఆమోదం పట్ల తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు హర్షం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కోర్టు మంజూరు చేయించుటంలో ఉపముఖ్యమంత్రి అనుక్షణం కృషి చేసినందుకు న్యాయవాదులు తరఫున కృతజ్ఞతలు ప్రకటించారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మార్గశిర శుద్ధ చవితి పర్వదినం సందర్భంగా శనివారం నుంచి నగరంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్థానిక అగ్రహారంలోని శ్రీ జనార్ధన స్వామి దేవస్థానంలో రాత్రి 12.34 గంటలకు ధనుర్మాస ప్రారంభ పూజలు, 22న నాచ్చియార్ తిరుక్కోలం, ప్రథమ పాసుర విన్నపం, స్వామి వారికి జగన్మోహిని అలంకరణ చేయనున్నారు. 23న ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా వైకుంఠద్వార దర్శనం ఏర్పాటు చేస్తారు. 23 నుంచి జనవరి 1 వరకూ స్వామి వారికి విశేష అలంకరణలు చేయనున్నారు. జనవరి 11న ఆండాళ్ తాయార్లకు 108 కలశాభిషేకం, నీరాటోత్సవం, 14న గోదా రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. వీటితో పాటు పవర్‌పేట శ్రీ వాసుదేవాలయం, రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సైతం శనివారం ధనుర్మాసోత్సవాలు ప్రారంభంకానున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముసునూరు: అతి వేగం వల్ల వ్యక్తి మృతిచెందిన సంఘటన ముసునూరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం నూజివీడు మండలం ముక్కొల్లుపాడుకు చెందిన కోరు ఏసుబాబు శుక్రవారం ఇంటి వద్ద నుంచి బయలుదేరి మండల కేంద్రం ముసునూరు మీదుగా ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతున్నాడు. తాళ్ళవల్లి వద్దకు వచ్చే సరికి బైక్ వేగం నియంత్రించలేకపోవడంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృత దేహాన్ని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

500 కలశాలతో ఊరేగింపు



కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, గోవిందులు

పాలకొల్లు సెంట్రల్: నేడు పట్టణంలో జరగనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి కల్యాణ మహోత్సవ ప్రాంగణం ఆర్.ఆర్ రైస్‌మిల్లు, పెనుమదం రోడ్డు వరకూ 500 మంది మహిళలు, గోవింద స్వాములు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. శనివారం ఉదయం గణపతి హోమం, సాయంత్రం 5 గంటలకు తిరుమల తిరుపతి వేదపండితులచే అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం జరపనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఖాజావలి

ఏలూరు(మెట్రో): లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేద చట్టానికి సంబంధించి ఏర్పాటుచేసిన సమావేశానికి ఆర్డీఓ అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో స్కానింగ్ మిషన్‌ల నిర్వాహకులు లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ వారు విధిగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. డాక్టర్ అనుమతి లేకుండా గర్భస్రావ మందులు అమ్మితే ఆ షాపుల యజమానులపై చర్యలు తీసుకొంటామని తెలిపారు. జిల్లాలోని ఆరోగ్య సిబ్బంది ద్వారా విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని, స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలను, డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని ఆదేశించారు. ఆడ, మగ ఇద్దరూ సమానమనే అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి నాగేశ్వరరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీతారామారావు, పీసీ, పీన్ డీటీ లీగల్ కన్సల్టెంట్ వి.సత్యరవి, డిప్యూటీ డెమో డి.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి షష్ఠి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పోస్టల్ కాలనీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నేటి నుంచి స్వామి వారి 23వ శాంతి కల్యాణ మహోత్సవాలు, షష్ఠి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు శనివారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అఖండ దీక్షాధారణ, వాస్తుహోమం, మండపారాధన పూజలు చేస్తారు. 17న నిత్య హోమం, నీరాజన మంత్రపుష్పాలు, 18న స్వామి మూలమూర్తులకు అభిషేకం, సాయంత్రం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 19న స్వామి వారికి అభిషేకాలు, 20న నిత్య హోమం బలిహరణ పూజలు, 21న ముగింపు సందర్భంగా అభిషేకం, కలశోద్వాసన, రాత్రి స్వామి వారికి పవళింపు సేవ చేస్తారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తుల నుంచి రూ. 25,040 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలంలోని వసంతవాడ గ్రామ శివారు పంట పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పేకాట స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ.25,040 నగదు, ఒక బైక్, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంక్షేమం కావాలంటే జగనే రావాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలను కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. స్థానిక 21వ వార్డు ఇన్‌చార్జి వెలనాటి సత్తిబాబు అధ్యక్షతన బోదిగట్టు సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు విశాల్ మాట్లాడుతూ పట్టణంలో దశాబ్దాల నుంచి వేచి చూస్తున్న ఈలి వరలక్ష్మి మెమోరియల్ హైస్కూలుకు జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నాడు–నేడు కార్యక్రమంలో నూతన భవంతిని, తరగతి గదులను నిర్మిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గ్రౌండ్‌ఫ్లోర్ పూర్తియిందని వచ్చే విద్యాసంవత్సరానికి నూతన భవనంలో తరగతులు నిర్వహించేలా వేగవంతంగా నిర్మాణం ఉంటుందన్నారు. తెదేపా పాలనకు జగన్ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించి వైఎస్సార్‌సిపికే మద్దతుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండు బోగుల నాగు, 1వ పట్టణ కన్వీనర్ కర్రి భాస్కరరావు, సింగం సుబ్బారావు, చామన సూర్యచంద్రరావు, బొద్దాని శ్రీనివాస్, పటానల గణపతి, ప్రసాద్, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి, తాడపర్తి రజని, అవిరెడ్డి లక్ష్మీనారాయణ, మారిశెట్టి వెంకటరమణ, పోతుల చంద్రశేఖర్, మన్సిపల్ మేనేజర్ దివ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం అర్బన్: 21వ వార్డు సమావేశంలో వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్‌ను సత్కరిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం రూరల్: పట్టెంపాలెం గ్రామ సచివాలయం వద్ద ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంక్షేమ రాజ్యం కొనసాగాలంటే జగనన్ననే ఎన్నుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కొనసాగాలంటే జగనన్నే తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పట్టెంపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, రూ.18,40,78,556 లబ్ధి చేకూర్చిన వివరాలతో ఉన్న ప్రగతి నివేదికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జంపెల్లి సత్యవతి, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు రెడ్డి), గంటి చిన సర్వేశ్వరరావు, పెనుమత్స సూరపరాజు, కాసాని వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సచివాలయ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రీడింగ్ రూమ్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన



తణుకులో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ప్రజల సౌకర్యార్థం రీడింగ్ రూము, పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు కొండాలమ్మ పుంత రోడ్డులో రూ.40 లక్షల మునిసిపల్ నిధులతో నిర్వహించే అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్థానిక ప్రజానీకం ఈ భవనాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు పిల్లి సూర్యారావు, నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, నాయకులు కుడుపూడి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

4వ రోజుకు అంగన్‌వాడీల నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, సహాయకులు

అత్తిలి: తమ న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. గ్రాట్యూటీ అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు, రిటైర్మెంట్స్ బెనిఫిట్స్ ఇవ్వాలని నినాదాలు చేశారు. నల్లచీరలు ధరించి నిరసన తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు టి. శాంతిస్వరూప్, మండల సెక్రటరీ సత్యమహేష్, సీఐటీయూ నాయకులు కె.ఝాన్సీ, ఎ.అజయ్‌కుమారి అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపారు.

ఇంధన పొదుపుపై విద్యార్థులకు పోటీలు



పొదుపు వారోత్సవాల్లో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తణుకు: ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా తణుకు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో స్కూలు విద్యార్థులకు విద్యుత్ వ్యాసరచన, వక్తృత్వ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఏడీఈ సీహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ విద్యుత్ పొదుపు అందరి బాధ్యత అని, పొదుపుపై అందరికీ అవగాహన అవసరమన్నారు. ఇంధన పొదుపులో అందరు గృహవినియోగదారులు, పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

మధుమేహంపై అశ్రద్ధ వద్దు



మధుమేహం వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మధుమేహంపై అశ్రద్ధ వద్దని లయన్స్‌క్లబ్ జోన్ ఛైర్‌పర్సన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు పేర్కొన్నారు. క్లబ్ డైమండ్స్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ గ్రౌండ్‌లో లయన్ పదంకుమార్ గుప్తా సహకారంతో శుక్రవారం మధుమేహ నిర్ధారణ పరీక్షలు జరిగాయి. వక్తలు మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు జరుగుతున్నాయని, ఆహారపు అలవాట్లు మార్పు చేసుకుంటూ వ్యాయమం, నడక, యోగా వంటివి చేస్తూ షుగర్‌ను నియంత్రించుకోవాలని కోరారు. వాకర్స్, షటిల్ ప్లేయర్స్, అపర్ణప్రసాద్, కంచర్ల నరసింహ, ఎం.కిరణ్, జి.సత్యనారాయణ, డి.ముఖర్జీ, కె.వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన

తాడేపల్లిగూడెం రూరల్: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. ప్రాజెక్టు అధ్యక్షురాలు దీన స్వరూపారాణి, ప్రభా రాణి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

ఎమ్మెల్సీ సాబ్జీకి నివాళి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉండి మండలం చెరుకవాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ (పీడీఎఫ్) షేక్ సాబ్జీ మృతి చెందడం అత్యంత బాధకరమని ఏబీటీయూసీ రాష్ట్ర సమితి ఉపాధ్యక్షులు డి.సోమసుందర్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సాబ్జీ మృతి ఉపాధ్యాయ ఉద్యమాలకు, వామపక్ష పోరాటాలకు తీరని నష్టమని పేర్కొన్నారు. అలాగే ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ కూడా సాబ్జి మృతికి సంతాపం తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు.

కల్లు గీత కార్మికులను ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కల్లు గీత కార్మికులను ఆదుకోవాలని సంఘ రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి కోరారు. పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం కల్లుగీత కార్మిక నాయకులతో సమావేశం జరిగింది. నరసింహమూర్తి మాట్లాడుతూ వృత్తిలో చనిపోయిన, వికలాంగులైన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. డివిజన్ కార్యదర్శి దాసరి సూరిబాబు, పచ్చేటి శ్రీనివాసరావు, అయినం సుబ్బారావు, చిటికన సత్తిపండు, పి.కనకారావు, రాజులపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహారం అందజేత

తణుకు అర్బన్: హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహారం అందిస్తున్న దాతల ఔదార్యం అభినందనీయమని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. తణుకు ఆస్పత్రి ఆవరణలో ఉన్న సేఫ్‌కేర్ సెంటర్‌లో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు దాతల సహకారంతో శుక్రవారం పోషకాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మందులు వాడుతున్న చిన్నారులకు తణుకు ఇషా హాస్పటల్ వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ ఒక ఏడాది పాటు ప్రతినెలా పోషకాహారం అందించే కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైందని, అలాగే హెచ్ఐవీతో బాధపడుతూ నీరసంగా ఉన్న బాధితులకు తణుకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ తరపున అధ్యక్షులు కరుణాకర చౌదరి ప్రొటీన్ బాక్స్‌లు అందించడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా దాతలను పలువురు అభినందించారు. సేఫ్ కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీటీసీ కో–ఆర్డినేటర్ హరనాథ్, సేఫ్ కేర్ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పుప్పాల రాజరాజేశ్వరి, ఆస్పత్రి స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ ఉషారాణి, ఇషా ఆస్పత్రి ప్రతినిధులు డాక్టర్ రాంబాబు, ఎం.తేజస్వి, సేఫ్‌కేర్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



పోషకాహారం అందిస్తున్న డాక్టర్ అరుణ తదితరులు

చర్చిల్లో ఆకట్టుకుంటున్న అలంకరణలు



ఎక్లాస్ ప్యారిస్ చర్చి ఆవరణలో అలరిస్తున్న క్రిస్మస్ పశువుల పాక

పెంటపాడు: క్రిస్మస్ నెల సందర్భంగా చర్చిల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతీ చర్చిలో క్రీస్తు జననవృత్తాంతాన్ని తెలిపే పశువుల పాక, క్రిస్మస్ ట్రీలు, విద్యుత్ కటౌట్‌లు ఆకర్షణగా నిలుస్తున్నాయి. తాడేపల్లిగూడెం టౌన్ ఏ క్లాస్ ప్యారిష్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో డిసెంబర్ 1 నుంచే పశువుల పాక సెట్టింగ్, క్రిస్మస్ తాత, విద్యుత్ వెలుగులతో క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేశారు. ఈ అలంకరణ విశ్వాసులను ఆకట్టుకుంటుంది.

బలుసులమ్మకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం దాతలు చింతలపాటి జగన్నాధరాజు, వెంకట రమ్య, కర్రి దీపిక, జల్లూరి శ్రీనివాస్‌లు సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించారు. ఆలయం వద్ద విశేష పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు కొట్టు అంజిబాబు, ఆలయ కార్యనిర్వహణ అధికారి రవి శంకర్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో బలుసులమ్మ

తాపీమేస్త్రి ఆత్మహత్య

పాలకోడేరు: అప్పుల బాధ తాళలేక ఓ తాపీమేస్త్రి కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. విస్సాకోడేరు శివారు వంకాయలపాలెంకు చెందిన దేశి ఏసుబాబు (30) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆదాయం చాలక అప్పులపాలై తీర్చే దారి లేక ఈనెల 14వ తేదీ రాత్రి 9 గంటలకు కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనిని భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడ నుంచి కోసం ఏలూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 11 గంటలకు మృతి చెందాడు. ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

రేపు సంగీత, సాంస్కృతిక సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళా కేంద్రంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహిస్తున్నట్లు సభాధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాకారుల ద్వారా ట్రాక్ సింగింగ్ అనంతరం సభ, సత్కార కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. వాసవి క్లబ్ ప్రెసిడెంట్ నున్న శ్రీనాగలక్ష్మి గౌరవ పురస్కారం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అల్లు శ్రీనివాసరావుకు సేవా పురస్కారం, భజన కళాకారుడు యిసరపు అబ్బులుకు ఆర్థిక సత్కారం చేస్తారని వెల్లడించారు. కళాకారులు, పట్టణ ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణపై అసహనం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై వార్డు సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న సభ్యులు రెడ్డి సత్యనారాయణ, కుప్పాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వార్డుల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి పన్నులు వేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. గ్రామంలో గృహ నిర్మాణాలకు అనుమతులు మంజూరులోనూ జాప్యం వల్ల యజమానులు పంచాయతీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు వద్ద ఇద్దరు పారిశుధ్య కార్మికులను తొలగించడంపైనా గ్రామ కార్యదర్శిని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సమావేశంలో ఉద్రిక్తత తగ్గింది. ఎంపీటీసీలు చంద్రు శ్యామల, విజయదుర్గ, తాడిపర్తి సుజాత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా అదనపు కోర్టు మంజూరుపై హర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో జిల్లా అదనపు కోర్టు మంజూరుకు కృషి చేసిన ప్రముఖులకు సీనియర్ న్యాయవాది మాకా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎడిషనల్ కోర్టు మంజూరుకు కృషి చేసిన దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి (తాడేపల్లిగూడెం), పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొవ్వూరి అప్పిరెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు 20 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్య వీరి ముగ్గురు సారధ్యంలో పరిష్కారం కావడం హర్షణీయమని కొనియాడారు.

రేపటి నుంచి ధనుర్మాస పూజలు

తణుకు అర్బన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి వచ్చే నెల 14వతేదీ వరకు ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజాధికాలు నిర్వహించనున్నట్లు హౌసింగ్ బోర్డు రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి పీపీ రంగరాజన్ చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలనుంచి పండితులతో ఆలయంలో తిరుప్పావై పాశురాలు స్వామివారికి నివేదిస్తామని తెలి పారు. ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారదర్శనం, వచ్చేనెల 3వతేదీన సాయంత్రం 6గంటలకు దీపోత్సవం, 11న సాయంత్రం 6 గంటలకు కూడారై ఉత్సవం, 14వ తేదీన గోదా కల్యాణం నిర్వహించనున్నట్లు వివరించారు.

ప్రభుత్వం చేసిన మేలును ఇంటింటికీ చెప్పండి

భీమవరం: గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో గత నాలుగున్నరేళ్లుగా చేసిన అభివృద్ధి పనులు గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కుల, మత, రాజకీయాలకు అతీతంగా చేయడం వల్లనే పార్టీ, ప్రభుత్వంపై ప్రజలు మక్కువగా ఉన్నారన్నారు. చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఓటు అడిగే హక్కు కేవలం వైఎస్సార్ సీపీకే ఉందని శ్రీనివాస్ స్పష్టం చేశారు. పట్టణంలో అమృత పథకంలో చేపట్టిన మూడు మంచినీటి రిజర్వాయర్లను త్వరలోనే ప్రజా వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.36 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తనతోపాటు పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటు ఉండడం వల్లనే అభివృద్ధి, సంక్షేమం వేగవంతంగా అమలు జరుగుతున్నాయన్నారు. మన ప్రభుత్వ హయాంలో ప్రజలకు జరిగిన మేలును పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని శ్రీనివాస్ తెలిపారు.



భీమవరంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

దురహంకార రాతలపై క్షమాపణలు చెప్పాలి

కాళ్ల: దురహంకారంతో రాతలు రాస్తున్న రామోజీ క్షమాపణలు చెప్పాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారావు డిమాండ్ చేశారు. పెదఅమిరం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పీవీఎల్ మాట్లాడారు. బైజూస్ కంటెంట్, ట్యాబులపై రామోజీ అశుద్ధమైన రాతలు రాస్తున్నారని తప్పుపట్టారు. పెత్తందారుల పిల్లలు ట్యాబులు వాడితే విజ్ఞానం కోసం, అదే పేదలు వాడితే చెడిపోవడమా అని ప్రశ్నించారు. పెత్తందారుల్ని, కులదురహంకారుల్ని తరిమికొట్టే రోజు త్వరలో వస్తుందని విమర్శించారు. పేద పిల్లలకు గవర్నమెంటు స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం పెట్టినప్పుడూ ఇలాగే వ్యతిరేకించారని అసహనం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు గవర్నమెంటు స్కూళ్లలో తమ పిల్లల్ని చదివిస్తూ ఎప్పటికీ పని వారిగానే మిగిలిపోవాలా అని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీ, నిరుపేదల పిల్లలంతా రూపాయి విలువ తెలిసి, చదువు విలువ తెలిసి, కష్టం విలువ తెలిసి పైకి వస్తారని, అటువంటి వారిపై నిందలు వేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడుగు, బలహీనవర్గాల మీద టీవీ ఎపిసోడ్‌ల తరహాలో నిత్యం విషం కక్కుతున్నారని అన్నారు. బడుగు, బలహీన వర్గాలపై ఇంత అసూయ, ఈర్ష్య, ద్వేషం ఎందుకని ప్రశ్నించారు.



డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

బీసీల అభివృద్ధికి కృషి చేస్తా

కాళ్ల: కోపల్లెకు చెందిన బలం సత్యనారాయణ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులు కావడంపై పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సత్యనారాయణ శుక్రవారం కోపల్లె గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. గత పాలకులు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని బీసీల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కానీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన అనంతరం బీసీలకు ప్రత్యేక స్థానం ఇచ్చి నామినేటెడ్ పదవులతో పాటు రాజ్యసభ సీట్లు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని తన విషయంలో రుజువైందన్నారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా తనను ఎంపిక చేయడంపై పార్టీ నాయకులకు, సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభివృద్ధికి కృషి చేస్తానని సీఎం జగన్మోహన్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తానని స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, నాయకులు పుత్తా ప్రతాప్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కంప్యూటర్ బహూకరణ

వీరవాసరం: పూర్వ విద్యార్థుల సహకారం మరువలేమని కొణితివాడ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మండా రామకృష్ణ అన్నారు. 1991 – 92లో చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం హైస్కూల్‌కు కంప్యూటర్‌ను అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇచ్చిన హామీ మేరకు రూ.41 వేల విలువ చేసే కంప్యూటర్‌ను బహూకరించడం అభినందనీయమన్నారు.

పాస్ పోర్టు పోయినది

గుబ్బల నాగసుబ్బన్న S/o పల్లారావు, మంచిలి(గ్రా), అత్తిలి (మం) ప.గో.జిల్లా, నేను 05.12.2023 తేదిన మాఇంటి దగ్గర నుంచి పాస్‌పోర్ట్‌ను (F 3351065) జిరాక్స్ నిమిత్తం అత్తిలి వెళ్లుచుండగా మార్గమధ్యలో సంచితో సహా పడిపోయినది. దొరికిన వారు ఈ నెంబర్‌కి తెలుపగలరు. సెల్: 9000546257

ఆగని పోషకాహార పంపిణీ

పాలకోడేరు: గత నాలుగు రోజులుగా అంగన్‌వాడీ వర్కర్లు తమ కోర్కెల సాధనకు సమ్మె చేస్తున్నప్పటికీ లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా సచివాలయ ఉద్యోగులు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. మండలంలోని కొన్ని కేంద్రాలను తెరిపించి, సచివాలయం ఉద్యోగులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు స్థానిక వార్డు సభ్యుల సమక్షంలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పోషకాహారం అందజేశారు. మరికొన్ని కేంద్రాల్లో పోషకాహార పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి వాణి విజయరత్నం తెలిపారు. ఇప్పటికే కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమ్మెకు ముందు పోషకాహార పంపిణీ చేయడం జరిగిందని, పంపిణీ చేయని కేంద్రాల్లో కూడా లబ్దిదారులకు అందజేస్తామన్నారు. మిగతా కేంద్రాలను కూడా తెరిపించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, మహిళా పోలీసులు ఉన్నారు.



గొరగనమూడిలో అంగనవాడీ కేంద్రాన్ని తెరిపించిన పంచాయతీ కార్యదర్శి పోలయ్య

17 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

వీరవాసరం: తోలేరులో వేంచేసియున్న శ్రీవల్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు ఈనెల 17 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు చవాకుల సత్యనారాయణమూర్తి శుక్రవారం చెప్పారు. తొలిరోజు ఉదయం 6 గంటలకు శ్రీ స్వామివారికి కావలి ఉత్సవ, 7 గంటలకు మంగళ వాయిద్య ఆలయ ప్రదక్షణ, భూత బలి, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ఆరాధన, త్రిశూలార్చన, మహన్యాస పూర్వక పంచామృతాభిషేకాలు, రాత్రి 7 గంటలకు స్వామివారికి దివ్య కల్యాణోత్సవం, 18న తెల్లవారుజామున 4 గంటల నుంచి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి తీర్థం, స్వామి వారి దివ్యదర్శనం, 9.30 గంటల నుంచి అఖండ అన్నసమారాధన, ఉదయం 10 గంటలకు కూచిపూడి, జానపద నృత్యప్రదర్శనలు, మధ్యాహ్నం సిద్దేంద్ర కూచిపూడి నాట్య కళాక్షేత్రం, ధవళేశ్వరం వారి కుమార సంభవం, యక్షగానం, కోలాటం, సాయంత్రం సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



తోలేరులో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి

దోమలను లార్వా దశలోనే నిర్మూలించాలి

తణుకు టౌన్: పట్టణాల్లోని డ్రైనేజీలలో మురుగునీరు నిల్వ కారణంగానే దోమలు పెరిగి ప్రజారోగ్యానికి హానికరంగా మారుతున్నాయని తణుకు మలేరియా సబ్ యూనిట్ అధికారి జీ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా వీరభద్రపురం ప్రాంతంలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయిన్లు డస్ట్ బిన్‌లు కాదని, డ్రెయిన్లలో చెత్త వేయడం వల్ల అవి పేరుకుపోయి దోమలు ఉధృతమై వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు, దోమలను పుట్టుకతోనే నిర్మూలించాలని కోరారు. డ్రెయిలలో మడ్డి ఆయిల్ పోయడం వలన దోమను లార్వాదశలోనే నివారించవచ్చన్నారు. దోమ వికర్షణ మొక్కలైన పుదీనా, బంతి మొక్కలను ఇంటి ఆవరణలో పెంచడం వలన దోమలను అదుపు చేయవచ్చన్నారు. వార్డులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వార్డు హెల్త్ సెక్రటరీలు పద్మజ, ఝాన్సీరాణి, ప్రసాద్, ఎం.శ్రీనివాస్, ఎస్ తాతాజీ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

అత్తిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎండీ అమీలుజమా శుక్రవారం తెలిపారు. అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

కొత్త ఆవిష్కరణలతో సామాజిక అభివృద్ధి

భీమవరం: సంక్షేమ విద్యుత్ వినియోగాన్ని పెంచుకునే విధానాలను, పరికరాల కొత్త ఆవిష్కరణలతో సామాజిక అభివృద్ధి సాధ్యమని ఎలక్ట్రికల్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎనర్జీ ఎఫిసియెంట్ ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటర్నెట్ ఆధారిత సాధనాలు, సర్వీసెస్, స్మార్ట్ హోమ్ అనుభవాలు, బిజీ లైఫ్‌స్టైల్స్ పరికరాలను అందించే టెక్నాలజీలను ఎంచుకోవచ్చునన్నారు. ఎలక్ట్రికల్ డీఈ ఎం.రాజగోపాల్‌చౌదరి, ఏఈ పి.శ్రీనివాసరాజు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ప్రిన్సిపాల్ ఎం.అంజన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీవీఎస్‌వర్మ పాల్గొన్నారు.